క్లుప్తంగా

మున్సిపాలిటీలో సమస్యలు పరిష్కరించాలి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బెల్లంపల్లి: మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎంసీపీఐ (యూ) నాయకులు కోరారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు గురువారం వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీలోని 34 వార్డుల్లో అనేక సమస్యలు ప్రజలను పట్టిపీడిస్తున్నాయని, రోడ్లు, మురికి నీటి కాలువలు, వీధి దీపాలు సరిగ్గా లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే ఆయా సమస్యలు తీర్చాలని, లేకపోతే ఆందోళనలు చేస్తామని పేర్కొన్నారు. ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి వెంకటేష్ పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ల ఆకస్మిక తనిఖీ



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్‌ఈ

దండేపల్లి: మండలంలోని గూడెం, వెల్గనూర్ విద్యుత్ సబ్‌స్టేషన్లను విద్యుత్ ఎస్‌ఈ శ్రావణ్‌కుమార్ బుధవారం రాత్రి ఆకస్మిక తనిఖీలు చేశారు. సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. విధులకు సక్రమంగా హాజరవుతున్నారా లేదా అనే వాటిని గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సరఫరాపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎల్‌సీల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. లాంగ్‌బుక్‌లు, రికార్డులు పరిశీలించారు. డీఈ కైసర్, ఏడీఈ ప్రభాకర్‌రావు, లక్సెట్టిపేట, దండేపల్లి ఏఈలు గణేష్, రాజనర్సు ఉన్నారు.

'ఉద్యమంలా మొక్కలు నాటాలి'



మాట్లాడుతున్న ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి

మేమనపల్లి: మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో మొక్కలు నాటడం కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీవో దేవేందర్ రెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గ్రామపంచాయతీ, ఉపాధిహామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. కూలీలకు పనులు కల్పించాలని పర్యావరణ దినోత్సవంలో భాగంగా క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం చేపట్టాలన్నారు. సామాజిక తనిఖీ కోసం రికార్డులు సిద్ధం చేయాలని తెలిపారు. మిషన్ భగీరథ సర్వే గూర్చి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఎంపీవో బాపురావు, ఏపీవో సత్యప్రసాద్, ఈసీ మధుకర్, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

కాలం చెల్లిన తినుబండారాలు విక్రయిస్తే చర్యలు



స్వీట్‌హౌజ్ యజమానికి జరిమానా విధిస్తున్న మున్సిపల్ కమిషనర్ గంగాధర్

చెన్నూర్: కాలం చెల్లిని తినుబండారాలను విక్రయిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ గంగాధర్ అన్నారు. స్థానిక గజానంద్ స్వీట్‌హౌజ్‌లో గురువారం నిర్వహించిన తనిఖీలలో నిర్ణీత కాలం ముగిసిన చాక్లెట్లు, బిస్కెట్లు, ఐస్‌క్రీమ్‌లు అమ్ముతున్నట్లు గుర్తించారు. షాపు యాజమానికి రూ.3000 జరిమానా విధించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. కల్తీ ఆహార పదార్థలు, నిర్ణీత కాలం చెల్లిన తినుబండారాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే షాపులను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలి

మంచిర్యాలఅర్బన్: ప్రైవేట్ పాఠశాలలో జరుగుతున్న దోపిడీని కట్టడి చేయటంలో ప్రభుత్వం విఫలమైందని ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు అజయ్ ఆరోపించారు. మంచిర్యాలలో గురువారం మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలలో ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 24వేలకు పైగా ఖాళీలున్నా టీచర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అటెండర్, స్కావెంజర్లను నియమించాలన్నారు.

నులిపురుగుల నిర్మూలనకు కృషి

- జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) రాహుల్
- పిల్లలకు తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్రలు వేయించాలని వైద్యుల సూచన



కోనూరులో పాఠశాలలో వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ రాహుల్

కాసిపేట: జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో ఒక్క సంవత్సరం నుంచి 19సంవత్సరాల వయస్సు గల పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసి, నులిపురుగుల నిర్మూలన దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) రాహుల్ తెలిపారు. జిల్లాలోని కాసిపేట మండలం కోనూర్, వెంకటపూర్, సోనాపూర్, తాటిగూడ గ్రామపంచాయతీల్లో చేపట్టిన అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం పరిశీలించారు. మాత్రలు అందనివారికి ఈ నెల 27న మప్ అప్ రౌండ్ ద్వారా అందించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అనంతరం అమ్మ ఆదర్శ కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను తనిఖీ చేసి గ్రామపంచాయతీ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, ఎంపీవో నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు రాము, మానస, మౌనిక, దీప్తి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

జైపూర్: పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు తప్పనిసరిగ్గా వేయించాలని జిల్లా వైద్యాధికారి అనిత తెలిపారు. ఇందారం అంగన్‌వాడీ కేంద్రం–2లో జిల్లా వైద్యాధికారి అనిత డీడబ్ల్యూవో చిన్నయ్యతో కలిసి పిల్లలకు నులిపురుగుల నివారణ మందులు వేశారు. ఏసీడీపీవో హితసత్య, ప్రోగ్రాం అధికారి శివప్రతాప్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత, వైద్యాధికారి శ్రావ్య, సిబ్బంది ఉన్నారు.

చెన్నూర్: పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనరాంలాల్‌గిల్డా నులిపురుగుల నివారణ మాత్రలను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్, కౌన్సిలర్ రేవెల్లి మహేశ్, వైద్యులు కృష్ణతేజ, రామకృష్ణ, ఎంపీ హెచ్‌ఈవోలు జగదీశ్, పుట్ట సత్తెయ్య, కళాశాల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

జన్నారం: స్థానిక ప్రభుత్వ బాలికల పాఠశాలలో విద్యార్థులకు ఎంపీపీ సరోజన, జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ మాత్రలు వేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శశికళ, వైద్యాధికారి ఉమాశ్రీ, హెచ్‌ఎం రాంబాబు, హెల్త్ అసిస్టెంట్లు పోచయ్య, సుశీల, కల్పన తదితరులు పాల్గొన్నారు.



ఇందారం-2 అంగన్‌వాడీ కేంద్రంలో డీఎంహెచ్‌వో



చెన్నూర్: మాత్రలు వేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

వేమనపల్లి: మండలంలోని నీల్వాయి ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు వేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశోక్, ఎంఎల్‌హెచ్‌పీ తేజశ్విని, ఏఎన్‌ఎం కళావతి , ఆశ కార్యకర్త ఉదయ తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లిరూరల్: ముందస్తు రక్షణ చర్యలు పాటించడంతోనే నులి పురుగులను నివారించవచ్చని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సత్యనారాయణ, ఎంపీపీ శ్రీనివాస్ అన్నారు. తాళ్లగురిజాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అల్బెండజోల్ మాత్రల పంపిణీ చేపట్టారు. మండలంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ బాలుర గురుకుల విద్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు మాత్రలు వేశారు. ఆయా కార్యక్రమాల్లో తాళ్లగురిజాల పీహెచ్‌సీ వైద్యురాలు ఎవంజలీన్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సత్తయ్య, ఎంపీడీవో మహేందర్, ఎంపీవో శ్రీనివాస్, సీహెచ్‌వో ప్రభాకర్, హెచ్‌ఈవో సమ్మయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: మండలంలోని జెండావెంకటాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు మాత్రలు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశవర్కర్లు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులు, చిన్నారులకు మాత్రలు వేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మందపల్లి స్వర్ణలత, వైస్ ఎంపీపీ రమాదేవి, హాజీపూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి లహరి, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, ఆయాలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

భీమిని: భీమిని, కన్నెపల్లి మండలాల్లో విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. భీమిని ఎంపీపీ రాజేశ్వరి విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు వేశారు. వైద్యుడు కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారుల ప్రతిభ అభినందనీయం

- జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్



అభినందిస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: కర్ణాటక రాష్ట్రంలో బాగల్‌కోట్‌లో ఈ నెల 10 నుంచి 13వరకు జరిగిన సౌత్ జోన్ ఖేల్ ఇండియా వుషు ఉమెన్స్ లీగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ అభినందనీయమని జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. కలెక్టర్ చాంబర్లో గురువారం జిల్లా యువజన క్రీడాధికారి కీర్తి రాజ్‌వీరు, కోచ్ మాటూరి శివమహేష్‌తో కలిసి పోటీలలో అత్యంత ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఖేల్ ఇండియా పోటీల్లో జిల్లా నుంచి పాల్గొన్న క్రీడాకారులు పతకాలు సాధించడం సంతోషంగా ఉందని, భవిష్యత్‌లో మరింత కృషి చేసి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి పతకాలను సాధించాలని, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. సీనియర్ విభాగంలో థైజిజియాన్ పోటీలో వి.నవీన, ప్రథమ స్థానం, థైజిక్వాన్ పోటీలో ఓ.అనిత తృతీయ స్థానం, సబ్ జూనియర్ విభాగంలో థైజిజియాన్ పోటీలో జి. మన్విత, లక్ష్మీరాజ్ తృతీయ స్థానం, హర్షిత, హసిని, ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వుషు సంఘం సభ్యులు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న ఉమాదేవి

బెల్లంపల్లి: అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రీ స్కూల్ కార్యకలాపాలపై అవగాహన కల్పించడానికి మూడు రోజుల శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. బెల్లంపల్లి ఐసీడీఎస్ సీడీపీవో ఎం.ఉమాదేవి గురువారం శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉమాదేవి మాట్లాడుతూ.. బడిబాట, న్యూకరిక్యులం, ఈసీసీఈ ప్రాధ్యానత తదితర కార్యక్రమాల గురించి శిక్షణ తరగతులు ఉంటాయని తెలిపారు. వీటిపై కార్యకర్తలు సరైన అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో 35మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, 9మంది సూపర్‌వైజర్లు హాజరయ్యారు.

ఈ రోజు

చెక్కుల పంపిణీ

చెన్నూర్: ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం 12గంటలకు లబ్ధి దారులకు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మల్లిఖార్జున్ తెలిపారు. లబ్ధిదారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

మంచిర్యాలలో 2కే రన్

పాతమంచిర్యాల: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని శ్రీనివాస గార్డెన్ నుంచి బెల్లంపల్లి చౌరస్తా వరకు శుక్రవారం ఉదయం 5.30గంటలకు 2కే రన్ నిర్వహిస్తున్నట్లు సూర్యయాన్ వాకర్స్ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులు 2కే రన్ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

భీమారం: మండలంలోని 11 గ్రామపంచాయతీలకు శుక్రవారం మధ్యాహ్నం 1గంట నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ కుమారస్వామి తెలిపారు. మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్తది ఏర్పాటు చేసే పనులు చేపట్టనున్నట్లు, ఈ మేరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ప్రజలు గమనించాలని ఏఈ కోరారు.

క్రీడా పాఠశాల ప్రవేశానికి ఎంపిక

చెన్నూర్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 21 నుంచి 25 వరకు తెలంగాణ క్రీడా పాఠశాల ప్రవేశానికి మండల స్థాయి ఎంపిక పరీక్షలను నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి కొమ్మెర రాధాకృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక పరీక్షలకు 1 సెప్టెంబర్ 2015 నుంచి 31ఆగష్టు 2016మధ్య జన్మించి ప్రస్తుతం నాల్గో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. మండల స్థాయి ఎంపిక పోటీల్లో గెలిపొందిన విద్యార్థులకు ఈ నెల 28న జిల్లా స్థాయి ఎంపిక పోటీలు ఉంటాయని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

దండేపల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ పొందేందుకు ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని, దండేపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ శోభ తెలిపారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో ఉత్తమ విద్యాబోధన, ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న తమ కాలేజీలో అడ్మిషన్ పొందేందుకు గడువులోగా విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

సంక్షిప్త వార్తలు

స్నేహభావంతో మెలగాలి

జన్నారం: గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొనాలంటే గ్రామస్తులందరూ ఘర్షనలు పడకుండా స్నేహభావంతో మెదలాలని ఎస్సై రాజవర్ధన్ అన్నారు. సీపీ శ్రీనివాసులు ఆదేశాల మేరకు.. జన్నారం మండలం చింతగూడలో 'పోలీస్ నైట్ హాల్ట్' కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో ఏఎస్సై బిక్కులాల్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జీలుగ విత్తనాలు పంపిణీ

మందమర్రిరూరల్: మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం వద్ద గురువారం ఎంపీపీ గుర్రం మంగ మండల వ్యవసాయ విస్తరణ అధికారి తిరుపతితో కలిసి రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు.

కరపత్రాలు ఆవిష్కరణ

చెన్నూర్: జిల్లాలోని సమస్యల పరిష్కారం కోసం బెల్లంపల్లి పట్టణంలో ఈ నెల 28నుంచి 30వరకు నిర్వహించే జిల్లా స్థాయి రాజకీయ తరగతులకు ఆర్థిక సాయం కోసం ఇంటింటికీ సీపీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి తెలిపారు. స్థానికంగా 'ఇంటింటికీ సీపీఎం' కరపత్రాలను ఆవిష్కరించారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

భీమారం: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో చర్యలు చేపట్టాలని ఎంపీడీవో రాధారాథోడ్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం 'సీజనల్ వ్యాధుల నివారణ' అనే అంశంపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేపించాలని కార్యదర్శులను ఆదేశించారు. దోమలు వ్యాపించకుండా బ్లీచింగ్ పౌడరు వేయాలన్నారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో జీనత్‌తో పాటు కార్యదర్శులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

జైపూర్: మండల కేంద్రంలో మంచిర్యాల ఆర్టీసీశాఖ ఆధ్వర్యంలో గురువారం రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. మంచిర్యాల డిపో రక్షణాధికారి జీఆర్.మౌళి గమ్యం యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. మహాలక్ష్మి పథకం అందరూ వినియోగించుకోవాలని, కళాశాలలు, పాఠశాలలు ప్రారంభమయ్యాయని విద్యార్థులు బస్సుపాసులు తీసుకోవాలని సూచించారు.

వర్షాల కోసం కప్పతల్లి ఆట

మంచిర్యాలఅర్బన్: స్థానిక హమాలీవాడ పోచమ్మ ఆలయం వద్ద వరుణదేవుడు కరుణించాలని కోరుతూ గురువారం కప్పతల్లి ఆట ఆడారు. కప్పతల్లికి బిందెలతో నీళ్ల పోశారు. వర్షం కురువాలని పూజలు చేశారు. కప్పతల్లి ఆటలతో వర్షాలు కురుస్తాయని స్థానిక వార్డు ప్రజలు, రైతులు నమ్మకంగా చెప్పారు.

అనారోగ్యంతో వృద్ధురాలు మృతి

మందమర్రిరూరల్: పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయం పక్కన విద్యానగర్‌లో ఒంటరిగా అద్దె ఇంట్లో నివసించే రాగంశెట్టి మల్లక్క (60)అనారోగ్యంతో గురువారం తెల్లవారుజామున మృతి చెందింది. మృతురాలి భర్త సింగరేణి విశ్రాంత కార్మికుడు మల్లయ్య నాలుగు సంవత్సరాలు క్రితం మృతిచెందాడు. ఆమెకు ముగ్గురు కుమారులు తిరుపతి, వెంకటేష్, సురేష్‌తో పాటు కూతురు ఉన్నారు. మల్లక్క చనిపోయిన విషయం ఇంటి యజమాని కొమురయ్య కుమారులకు తెలియజేయడంతో, వచ్చిన కుమారులు తల్లి మృతదేహాన్ని వారి ఇంటికి తీసుకెళ్లడానికి నిరాకరించారు. కిరాయి ఇంటి వద్ద ఉన్నటువంటి కాలనీవాసులు చందాలు వేసుకుని అంత్యక్రియలు చేయడానికి సిద్ధపడడంతో కుమారుల్లో చలనం వచ్చి అక్కడ నుంచి తల్లి మృతదేహాన్ని కుమారులు విద్యానగర్ లోని వారి ఇంటి వద్దకు తీసుకెళ్లి కాలనీవాసులతో కలిసి అంత్యక్రియలు జరిపించారు.

అనుకూల పరిస్థితుల్లో విత్తనాలు వేసుకోవాలి



ముత్యంపల్లిలో సాగును పరిశీలిస్తున్న ఏవో వందన

కాసిపేట: ప్రస్తుతం వర్షాకాలంలో అనుకూల పరిస్థితులు గమనిస్తూ రైతులు విత్తనాలు వేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి వందన సూచించారు. మండలంలోని వెంకటాపూర్, కొండాపూర్, ముత్యంపల్లి గ్రామాల్లో గురువారం వ్యవసాయాధికారులు పత్తిపంట సాగు చేసే క్షేత్రాలను సందర్శించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణాధికారులు రమ్య, అంజలి, రైతులు పాల్గొన్నారు.

అంబేద్కర్ భవన్ స్థలంలో అక్రమ నిర్మాణాలు ఆపాలి



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో అంబేద్కర్ భవన్ నిర్మాణం కోసం కేటాయించిన స్థలంలో అక్రమ నిర్మాణాలు వెంటనే ఆపివేసి, అర్ధంతరంగా ఆగిపోయిన భవన నిర్మాణ పనులు ప్రారంభించి పూర్తి చేయాలని పూలే, పెరియార్, అంబేద్కర్ ఆలోచన వేదిక నాయకులు డిమాండ్ చేశారు. బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంబేద్కర్ భవన్ నిర్మాణ పనులు ముందుకు సాగకపోవడంతో, అక్రమార్కుల కన్ను పడిందన్నారు. ఖాళీ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు కొందరు యత్నాలు చేస్తున్నారన్నారు. నిలిచిపోయిన అంబేద్కర్ భవన నిర్మాణ పనులను సత్వరంగా పూర్తి చేయించి, ఖాళీ స్థలం కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పూలే, పెరియార్, అంబేద్కర్ ఆలోచన వేదిక అధ్యక్షుడు శ్రీహరి, ప్రధాన కార్యదర్శి రంగ ప్రశాంత్, ఉపాధ్యక్షుడు లింగంపల్లి రాజన్న, జి.స్వామి, కార్యదర్శులు ఎల్తూరి శంకర్, బోగే సత్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం



మున్సిపల్ కార్యాలయంలో స్వీకరిస్తున్న సిబ్బంది

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపల్ కార్యాలయంలో గురువారం ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణను ప్రారంభించారు. గతంలో ప్రజాపాలన దరఖాస్తులను అందించినా, వారికి పథకాలు అందకుండా ఉన్నవారి నుంచి మరోసారి వివరాలను సేకరించి, ప్రజాపాలన వెబ్‌సైట్‌లో ఆయా వివరాలను ఎడిట్ చేస్తున్నారు. గతంలో దరఖాస్తు చేసుకోని వారు, కొత్తగా దరఖాస్తు చేసుకుంటుండగా, ఆయా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు అవకాశాన్ని కల్పించలేదు. దీంతో మున్సిపల్ సిబ్బంది దరఖాస్తులను స్వీకరించి పంపిస్తుండడంతో, పథకాలు ఎప్పుడు అందుతాయనే దానిపై ఆరా తీసి దరఖాస్తుదారులు వెళ్లిపోతున్నారు.

టీయూడబ్ల్యూజే ఈసీ మెంబర్‌గా ప్రకాష్ రెడ్డి



పాతమంచిర్యాల: ఇండియన్ జర్నలిస్టు యూనియన్ అనుబంధ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా మంచిర్యాలకు చెందిన సీనియర్ పాత్రికేయుడు రూపిరెడ్డి ప్రకాష్‌రెడ్డి ఎన్నికయ్యారు. రాష్ట్ర మహాసభలలో భాగంగా ఈ నెల 19, 20వ తేదీలలో ఖమ్మంలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. గురువారం నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలలో ప్రకాష్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వరుసగా రెండు పర్యాయాలు ఏకగ్రీవ సభ్యుడిగా ఎన్నికైన ప్రకాష్‌రెడ్డిని జర్నలిస్టులు అభినందించారు.

టీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శిగా చంద్రశేఖర్



జన్నారం: తెలంగాణ స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా జన్నారం మండలానికి చెందిన గొలపెల్లి చంద్రశేఖర్ ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు అంజి నియామకపత్రం అందజేశారు. నల్గొండలో జరిగిన రాష్ట్రస్థాయి సమావేశంలో ఈ నియామకం చేసినట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా చంద్రశేఖర్ క్రమశిక్షణతో సంఘ నిబంధనల ప్రకారం విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఆయన సేవలను గుర్తించి, ఈ పదవిలో నియమించినట్లు ఆయన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రాష్ట్ర అధ్యక్షుడికి ధన్యవాదాలు తెలిపారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్‌కు సన్మానం



డైరెక్టర్ రాజన్నను సన్మానిస్తున్న సంఘనాయకులు

దండేపల్లి: లక్సెట్టిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన కట్కూరి రాజన్నను దండేపల్లిలో యాదవ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ గొట్ల భూమన్న, గొర్రెల పెంపకం దారుల సంఘం అధ్యక్షుడు అల్లంల కుమారస్వామి, నాయకులు చౌదరి గంగమల్లు, గొట్ల సంతోష్, ప్రశాంత్, సురేష్, గౌరీ తదితరులు పాల్గొన్నారు.

బీసీ జనగణన చేపట్టాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

దండేపల్లి: రాష్ట్రంలో బీసీ జనగణన చేపట్టి, బీసీలకు రిజర్వేషన్లు కేటాయించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ ఐక్యవేదిక మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు వడ్డేపల్లి మనోహర్ డిమాండ్ చేశారు. దండేపల్లిలో బీసీనాయకులతో కలిసి గురువారం తహసీల్దార్ సంధ్యారాణికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌పార్టీ బీసీలకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. బీసీ డిక్లరేషన్ పేరిట కులగణన చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు వొడ్నాల శంకర్, బొలిశెట్టి లక్ష్మీనారాయణ, శంకరయ్య, శ్రీధర్, వెంకటపతి, శ్రీనివాస్, సత్యం, గంగన్న, సత్తయ్య, శేఖర్, వెంకటేష్, రాజు పాల్గొన్నారు.

ముందస్తుగా యోగా దినోత్సవం



యోగా సాధన చేస్తున్న శిక్షకులు



సర్టిఫికెట్లతో యోగా సాధకులు

మంచిర్యాలటౌన్: పదో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని హైటెక్ సిటీ కాలనీలో గల మైత్రి యోగా ప్రకృతి చికిత్సా కేంద్రంలో ముందస్తు యోగా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచితంగా యోగా శిక్షణను అందిస్తున్న నిర్వాహకులు, సాధకులతో కలిసి యోగాసనాలు వేశారు. యోగా చేయడం వల్ల కలిగే లాభాలను నిర్వాహకులు డాక్టర్ సుకుమార్, డాక్టర్ సమీరలు వివరించారు. కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రమణ, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు గుండ సుధాకర్, హైటెక్‌సిటీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చిట్టినేని హన్మంతరావు పాల్గొన్నారు.

నేడు అమృత్ సరోవర్ చెరువుల వద్ద యోగా డే

పాతమంచిర్యాల: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన అమృతసరోవర్‌ల (చెరువులు కుంటలు) వద్ద యోగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎస్ కిషన్ తెలిపారు. జిల్లాలోని 75అమృత్ సరోవర్‌ల వద్ద యోగా కార్యక్రమాన్ని గ్రామస్తులు, అధికారుల భాగస్వామ్యంతో నిర్వహిస్తామన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల: 9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల : సల్మాన్‌ఖాన్ - 7995855506
బెల్లంపల్లి : సంపత్ - 7036227114
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899